సాక్షి
వికారాబాద్
శనివారం । 22 । ఏప్రిల్ । 2023



విద్యుత్ ఇక నిరంతరం
వేసవి నేపథ్యంలో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. ప్రజలకు మెరుగైన సరఫరా అందించేందుకు ఆశాఖ ఏర్పాట్లు చేసింది. 12లో▸



క్షుద్రపూజల కలకలం
రూప్‌ఖాన్‌పేట్‌లో క్షుద్రపూజలు కలకలం రేపాయి. గ్రామ శివారు వాగులో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించారు. 12లో▸



పీహెచ్‌సీల్లో 'ఆరోగ్య మహిళ'
మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 'ఆరోగ్య మహిళ' పేరుతో వైద్య సేవలు అందించనుంది. 13లో▸

న్యూస్‌రీల్

'మనబడి' పనుల్లో నాణ్యత పాటించాలి



మోత్కుపల్లిలో పనులు పరిశీలిస్తున్న పీఆర్ డీఈ జితేందర్‌రెడ్డి

బంట్వారం: అంచనా విలువ రూ.30 లక్షలకు పైగా ఉన్న మన ఊరు– మన బడి పనులను ఎస్‌ఎంసీల ద్వారానే చేపట్టాలని పీఆర్ డీఈ జితేందర్‌రెడ్డి సూచించారు. కోట్‌పల్లి మండలంలోని అన్నాసాగర్, మోత్కుపల్లి, బార్వాద్, మల్‌శెట్టిపల్లితండాల్లో కొనసాగుతున్న మన బడి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. వేసవి సెలవులు పూర్తయ్యేలోపు పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ చంద్రప్ప, సీఆర్‌పీ నర్సింలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పరిగి బార్ అసోసియేషన్ రద్దు

- ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- అడ్‌హక్ కమిటీ మెంబర్లుగా దయాకర్‌రెడ్డి, గౌస్‌పాష




పరిగి: పరిగిలో నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని రాష్ట్ర బార్ కౌన్సిల్ పేర్కొంది. సదరు కమిటీ నియమకాన్ని రద్దు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పరిగి బార్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ మెంబర్లుగా దయాకర్ రెడ్డి, గౌస్‌పాషను నియమించింది. గతంలో జరిగిన ఎన్నికలను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈనెల 21 నుంచి 24 వరకు నామినేషన్లు వేసుకోవాలని, 25న ఉపసంహరణ, 28న ఎన్నికలు, 29న నూతన బార్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది.

రేపు జీసెట్ ప్రవేశ పరీక్ష

యాలాల: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాల కోసం ఆదివారం ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు (జీసెట్ 2023– 24) కోకట్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న తమ పాఠశాలలో ఎగ్జామ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్లూ లేదా బ్లాక్ పెన్ను, ఎగ్జామ్ ప్యాడ్ తప్పనిసరిగా తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు 9704550231నంబర్ స్టేటస్ లోకేషన్ చూడాలని సూచించారు.

11నుంచి ఒంటిగంట వరకు పరీక్ష

తాండూరు టౌన్: తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల ఐదో తరగతి ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహిస్తామని తాండూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఖాంజాపూర్ గేటు ఎదురుగా ఉన్న టీఎస్ గురుకుల పాఠశాల కేంద్రానికి విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

అమర జవాన్లకు బీజేపీ నివాళి



కుల్కచర్లలో కొవ్వొత్తుల ర్యాలీ

కుల్కచర్ల: పూంచ్ సెక్టార్‌లో ఆర్మీ వాహనంపై ఉగ్రదాడిని బీజేపీ శ్రేణులు ఖండించాయి. అమర జవాన్లకు నివాళులర్పిస్తూ శుక్రవారం రాత్రి కుల్కచర్లలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు కరణం ప్రహ్లాదరావు, శరత్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్ల పరిహారం

ప్రభుత్వం నుంచి విడుదల

- త్వరలోనే రైతుల ఖాతాల్లోకి..
- జిల్లాలో 7వేల మంది బాధితులు
- 2,510 మందికే ఊరట
- తుది నివేదికను లెక్కలోకి తీసుకోని సర్కారు



మర్పల్లి మండలంలో కురిసిన వడగండ్ల వానతో ధ్వంసమైన టమాటా పంట (ఫైల్)

వికారాబాద్: యాసంగి సీజన్‌కు సంబంధించిన పంట నష్ట పరిహారం వచ్చేసింది. ఇటీవల కురిసిన వడగండ్ల వానతో జిల్లాలోని మర్పల్లి, మోమిన్‌పేట తదితర మండలాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఆ వెంటనే జిల్లాలో పర్యటించిన మంత్రులు రైతులను పరామర్శించారు. నష్టపోయిన పంటలకు సంబంధించి.. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు మూడు నివేదికలను ప్రభుత్వానికి అందజేశారు. ఇందులో రెండోసారి ఇచ్చిన రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. 2,510 మందికి సంబంధించిన 3,399 ఎకరాలకు పరిహారం విడుదల చేసింది. ఈలెక్కన సగం మందికే పరిహారం అందనుంది.

సగానికే పరిహారం

పంటల సాగులో వచ్చిన మార్పులు, వాడుతున్న సాంకేతికత, వినియోగిస్తున్న పురుగు మందులు, ఎరువుల కారణంగా ఇటీవల పంట పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. వ్యవసాయ పంటలకు ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల ఖర్చవుతుండగా.. ఉద్యాన పంటలకు రూ.60 వేల పెట్టుబడి వస్తోంది. ఈ నేపథ్యంలో ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలని ప్రతిపక్షాలు, రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాత్రం పంట ఏదైనా ఎకరాకు రూ.10 వేల చొప్పున విడుదల చేసింది. జిల్లాలో కనీవినీ ఎరగని రీతిలో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో పంటలకు తీరని నష్టం జరిగింది. ముఖ్యంగా ఉద్యాన పంటలు బాగా పాడయ్యాయి. ప్రభుత్వ ఆదేశంతో సర్వే చేపట్టిన వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు మొదట ప్రాథమిక నివేదికను అందజేశారు. వర్షం కురిసిన మరుసటి రోజే నివేదిక ఇవ్వాలని చెప్పడంతో అన్ని గ్రామాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం కుదరలేదు. దీంతో జిల్లాలో 2005 ఎకరాల మేర పంటలు పాడయ్యాయని ప్రైమరీ రిపోర్ట్ ఇచ్చేశారు. నాలుగు రోజుల తర్వాత మరో నివేదికలో రూపొందించి 3,399 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. చివరకు వారం రోజుల పాటు అన్ని గ్రామాల్లో తిరిగి సమగ్ర నివేదిక రూపొందించారు. ఈలెక్కన మొత్తం 7వేల ఎకరాల్లో పంటలు ధ్వంసమయ్యాయని నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. కానీ ప్రభుత్వం మాత్రం రెండోసారి అందజేసిన నివేదికను పరిగణనలోకి తీసుకుని 2,510 మంది రైతులకు సంబంధించి 3,399 ఎకరాల్లో జరిగిన పంట నష్టాన్ని మాత్రమే లెక్కలోకి తీసుకుంది. ఈ మేరకు రూ.3,39,91,750 విడుదల చేసింది. దీంతో సగం ఎకరాలకే పంట నష్టం అందింది.

గత మూడు సీజన్ల ఊసేలేదు

2020లో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో సాగుచేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ అధికారులు సర్వే ప్రకారం 4.5 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవగా.. 1.25 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. మరుసటి ఏడాది ఇదే తరహాలో భారీ వర్షాలు కురవటంతో 25వేల ఎకరాల్లో పంట నష్టం సంభవించిందని అధికారులు నివేదిక పంపించారు. 2021, 2022 సీజన్లలోనూ వరుసగా కురిసిన భారీ వర్షాలకు మరో 2వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి ఒక్క ఎకరాకు కూడా పరిహారం అందలేదు.

ఖాతాల్లో జమ చేస్తాం



వరుసగా గత మూడు వ్యవసాయ సీజన్లలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం వాటిల్లింది. సర్వే నిర్వహించి వివరాలను ప్రభుత్వానికి పంపించాం. ఈ ఏడాది కూడా నష్టపోయిన పంటలకు సంబంధించిన వివరాలను మండలాల వారీగా సేకరించి నివేదిక అందించాం. కేవలం ఇటీవల కురిసిన వడగండ్లతో నష్టపోయిన పంటలకు మాత్రమే ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. ఈ డబ్బులను త్వరలోనే బాధిత రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

– గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

నేను తాండూరు బిడ్డను..

- ఇక్కడే పుట్టా.. ఇక్కడే చస్తా
- మంత్రులు చేయలేని అభివృద్ధి ఏడాదిలో చేసి చూపించా
- ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి
- కాశీంపూర్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశం



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నేతలు

బషీరాబాద్: 'నేను తాండూరు బిడ్డను.. ఇక్కడే పుట్టా.. ఇక్కడే చస్తా.. ఈ ప్రాంత అభివృద్ధే నా ధ్యేయం. ఇన్నాళ్లు మంత్రులుగా పనిచేసిన వాళ్లు చేయలేని అభివృద్ధిని ఏడాది కాలంలోనే చేసి చూపించా. మీ అందరి ఆశీర్వాదంతో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున బరిలో నిలుస్తా' అని తాండూరు ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బషీరాబాద్ మండలం కాశీంపూర్ వద్ద నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డిపై పరోక్ష విమర్శలు చేశారు. నాలుగుసార్లు తాండూరు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. ఇక్కడి ప్రజల ఓట్లతో గెలిచి.. వేరే నియోజకవర్గంలో మెడికల్ కాలేజీలు పెట్టారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచి నాలుగు సంవత్సరాలు అవగా.. గడిచిన ఏడాది కాలంలో రూ.134 కోట్లతో ఎవరూ చేయని పనులు చేస్తున్నానని చెప్పుకొచ్చారు. తాండూరులో రోడ్ల విస్తరణ చేపట్టి.. కాలుష్యాన్ని దూరం చేశానని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తానని స్పష్టంచేశారు.

దేశానికే ఆదర్శం

బీఆర్‌ఎస్, కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రోహిత్‌రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో శరవేగంగా దూసుకుపోతోందని తెలిపారు. వ్యవసాయం పండుగలా మారిందన్నారు. రైతులు, మహిళల అభివృద్ధికి పెద్దపీట వేశారని, గడిచిన ఎనిమిదేళ్లలో 2లక్షల ఉద్యోగాలు కల్పించారని వివరించారు. అంతకు ముందు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైల్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ కుట్రలను భగ్నం చేసిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ద్వారా తాండూరుకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలను తరిమికొడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మెల్యే డీజే పాటకు రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి స్టెప్పులేశాడు. ఆత్మీయ సమావేశానికి భారీగా జన సమీకరణ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాము నాయక్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రామ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నపూర్ణ, కౌన్సిలర్ విజయదేవి, నాయకులు గోపాల్‌రెడ్డి, అశోక్‌గౌతం, జయమ్మ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ముద్దాయిపేట శివారులో ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా

రంజాన్‌కు సర్వం సిద్ధం

- ముస్తాబైన ఈద్గాలు, మసీదులు
- నేడు షీర్‌కుర్మా పంపిణీ, అన్నదానం

యాలాల: ఈద్– ఉల్– ఫితర్ (రంజాన్) పండుగను శనివారం ఘనంగా జరుపుకొనేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. సౌదీ అరేబియాలో గురువారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో శుక్రవారం అక్కడ పండగ పూర్తయింది. మరుసటి రోజైన శనివారం దేశవ్యాప్తంగా వేడుకలకు ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ముద్దాయిపేటలో ఈద్ మిలాఫ్‌కు జామియా మసీదు ఆధ్వర్యంలో వసతులు కల్పించారు. ప్రార్థనల అనంతరం మసీదు ఆవరణలో షీర్‌కుర్మా పంపిణీ, అన్నదానం ఉంటుందని మత పెద్దలు తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి ఈద్‌మిలాఫ్ నిర్వహిస్తామన్నారు.

పండుగ శుభాకాంక్షలు



కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ముస్లింలకు కలెక్టర్ నారాయణరెడ్డి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మత సామరస్యానికి, ఐక్యతకు రంజాన్ ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన వారికి అభినందనలు తెలిపారు. భక్తిశ్రద్ధల తో అల్లాను ప్రార్థించిన వారికి ఆయన కరుణ ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ సోదరభావంతో మెలగాలని, కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా పండుగ చేసుకోవాలని తెలిపారు.

వెనకడుగు వేయొద్దు

- ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి
- ఉద్యోగ సాధనే లక్ష్యం కావాలి
- జిల్లా, తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలి
- నిరుద్యోగ యువతకు కలెక్టర్ దిశానిర్దేశం



వికారాబాద్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యువతతో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతగిరి: పోటీ పరీక్షల్లో వందకు వంద మార్కులు సాధించేలా ముందుకు సాగాలని కలెక్టర్ నారాయణరెడ్డి నిరుద్యోగులు, విద్యార్థులకు సూచించారు. ఒక్క మార్కు సైతం తగ్గకుండా ప్రిపేర్ ఐతేనే లక్ష్యం చేరుతారని దిశానిర్దేశం చేశారు. వికారాబాద్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. లైబ్రరీలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న వారి వద్దకు వెళ్లి మాట్లాడారు.

వెనకడుగు వేయొద్దు

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా లక్ష్య సాధనలో వెనకడుగు వేయొద్దని, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో చదివితేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగం సాధించిన వారికి సమాజంలో మంచి గుర్తింపుతో పాటు గౌరవం లభిస్తుందన్నారు. వ్యక్తిగత, కుటుంబ సమస్యలను లెక్క చేయకుండా ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదవాలని సూచించారు. పోటీ పరీక్షలు రాయడమంటే యుద్ధంలో పాల్గొనడమేనని, పక్కా ప్రణాళిక, పరిజ్ఞానంతో సిద్ధమైతేనే విజయం వరిస్తుందని తెలిపారు. మొబైల్ వాడకాన్ని తగ్గించడం, అతినిద్ర, బద్ధకాన్ని దూరం చేసుకోవడం వంటి చిన్నచిన్న త్యాగాలతో ఉత్తమ ఫలితాలు పొందవచ్చని సూచించారు. ప్రతిఒక్కరూ ఉద్యోగం సాధించి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

రాత్రి 10గంటల వరకు లైబ్రరీ

ఉదయం 8నుంచి రాత్రి 8గంటల వరకు కొనసాగుతున్న గ్రంథాలయ సమయాన్ని పెంచాలని పలువురు కోరగా.. రాత్రి వేళ 10 గంటల వరకు తెరిచి ఉంచాలని గ్రంథాలయ కార్యదర్శి సురేష్‌కుమార్‌ను ఆదేశించారు. అందరికీ అవసరమైన స్టడీ మెటీరియల్‌ను సమకూరుస్తామని తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన వివరాలను తెలుసుకునేందుకు లైబ్రరీ వద్ద వైఫై సౌకర్యం కల్పించాలని, అదనంగా వంద కుర్చీలు, రైటింగ్ ప్యాడ్లు తెప్పించాలని, అవసరమైతే సిబ్బందిని నియమించాలని సూచించారు.

ఆత్మస్థైర్యం నింపారు



నేను గ్రూప్– 4 కోసం ప్రిపేరవుతున్నా. కలెక్టర్ మావద్దకు వచ్చి పలకరించడం ఆనందంగా ఉంది. కలెక్టర్ స్వయంగా వచ్చి వెన్నుతట్టడంతో ఇంకా బాగా చదవాలనే ఆసక్తి పెరిగింది. ఆయన చెప్పిన మాటలు లైఫ్‌లో మరిచిపోలేము. అందరిలో ఆత్మస్థైర్యం నింపిన కలెక్టర్ సార్‌కు ధన్యవాదాలు.

– సంగమేశ్, వికారాబాద్

అడిగిన వెంటనే ఆదేశాలిచ్చారు



నేను గ్రూప్– 2కు సిద్ధమవుతున్నా. మేము అడిగిన వెంటనే వైఫై, కుర్చీలు, స్టడీ మెటీరియల్ ఇవ్వాలని ఆదేశించడం ఆకట్టుకుంది. పోటీ పరీక్షలు సమీపిస్తున్న వేళ లైబ్రరీ సమయాన్ని రాత్రి 10గంటల వరకు పెంచడం, పండుగలు, సెలవు దినాల్లోనూ గ్రంథాలయం తెరిచి ఉంచాలని ఆదేశించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు.

– పరశురాం, వికారాబాద్

అందరి దృష్టి చేవెళ్లపైనే..

- రేపే బీజేపీ 'విజయ సంకల్ప సభ'..
- హాజరు కానున్న అమిత్‌షా
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలపైనే ప్రధాన ఫోకస్
- ఏర్పాట్లలో పార్టీ నేతలు
- భారీగా తరలివస్తారని అంచనా



సభా స్థలిని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అధికార, ప్రతిపక్ష పార్టీల దృష్టి చేవెళ్లపై పడింది. ఆదివారం చేవెళ్ల పట్టణ కేంద్రంగా బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహిస్తుండటం, ఆ పార్టీ అగ్రనేత, హోంమంత్రి అమిత్‌షా హాజరవుతుండటమే ఇందుకు కారణం. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటం, సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి చర్యలు చేపడుతుండటం, ఇతర పార్టీల్లో అసంతృప్తితో ఉన్న ద్వితీయశ్రేణి నేతలు తమ రాజకీయ భవిష్యత్తును వెతుక్కుంటుండటం, ప్రజాదరణ కలిగిన నేతలను బీజేపీ ఆహ్వానిస్తుండటంతో అందరిలోనూ టెన్షన్ మొదలైంది. అమిత్‌షా పాల్గొనే బహిరంగ సభకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఏ నియోజకవర్గం నుంచి ఎవరు.. ఎంత మంది జనాన్ని సమీకరించబోతున్నారు? బహిరంగ సభలో అమిత్‌షా ఏం మాట్లాడబోతున్నారు? ఈ వేదికపై ఏమైనా ముఖ్యమైన చేరికలు ఉంటాయా? వేదిక ద్వారా జిల్లా ప్రజలకు ఏం చెప్పదల్చుకున్నారు? వంటి అంశాలపై అధికార బీఆర్‌ఎస్ సహా ప్రతిపక్ష కాంగ్రెస్‌లోనూ చర్చ జరుగుతోంది.

పల్లెల్లో పాగా వేసేందుకు యత్నం

పట్టణ ప్రాంతాలతో పోలిస్తే..గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ కొంత బలహీనంగా ఉంది. 2024లో మళ్లీ అధికారంలోకి రావాలంటే ఇప్పటి వరకు ఒక్కసారి కూడా విజయం సాధించని 160 పార్లమెంట్ స్థానాలపై బీజేపీ అగ్రనాయకత్వం దృష్టి సారించింది. ఎలాగైనా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ జెండా ఎగరవేయాలనే వ్యూహంతో ముందుకు సాగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీపై ప్రజల్లో ఉన్న క్రేజ్‌ను వచ్చే ఎన్నికల్లో ఓట్లరూపంలో మలుచుకునేందుకు పక్కా ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటి వరకు సంస్థాగతంగా బలమైన లీడర్, కేడర్ లేని ప్రాంతాలను ఇందుకు వేదికగా ఎంచుకుంది. ఆయా ప్రాంతాల్లో అగ్రనాయకత్వంతో బహిరంగ సభలు, సమీక్ష సమావేశాలు నిర్వహించడం ద్వారా పార్టీ కేడర్‌లో జోష్ పెంచి, సంస్థాగతంగా బలపడొచ్చని భావిస్తోంది. ఈ మేరకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఇందుకు వేదికగా ఎంపిక చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను, తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలు, కుటుంబ పాలన, అవినీతి వంటి అంశాలే ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో వారి ఆదరాభిమానాలు చూరగొనాలని యోచిస్తోంది.

రేపే.. 'విజయ సంకల్ప సభ'

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో ఆదివారం భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసింది. సాయంత్రం ఐదు గంటలకు పార్టీ అగ్రనేత, హోంమంత్రి అమిత్‌షా ఈ సభకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లా పరిధిలోని చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలే లక్ష్యంగా భారీ జనసమీకరణ చేయాలని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది.

క్లుప్తంగా

280 కిలోల బెల్లం పట్టివేత
వాహనం సీజ్, వ్యక్తి రిమాండ్



స్వాధీనం చేసుకున్న బెల్లంతో ఎక్సైజ్ పోలీసులు, నిందితుడు

తాండూరు టౌన్ : అక్రమంగా తరలిస్తున్న 280 కిలోల బెల్లం పట్టుకున్నట్లు తాండూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అనంతయ్య శుక్రవారం తెలిపారు. పెద్దేముల్ మండలం ఓమ్లానాయక్ తండాకు చెందిన రాథోడ్ పాండు కర్నాటక రాష్ట్రం నుంచి ఓ వాహనంలో 20 కిలోలు గల 14 బెల్లం ముద్దలను గ్రామానికి తరలిస్తున్నాడు. రాత్రివేళ గస్తీలో ఉన్న ఎక్సైజ్ పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా బెల్లం లభ్యమైంది. దీంతో బెల్లాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. పాండుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ చంద్రకాంత్‌రెడ్డి, సిబ్బంది కిషోర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ
మరోచోట చోరీకి యత్నం

తాండూరు టౌన్ : పట్టణంలోని సాయిపూర్‌లో పట్టపగలే దొంగలు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. సాయిపూర్‌కు చెందిన రమేశ్ గురువారం ఉదయం బయటకు వెళ్లగా, అతని భార్య మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తెరిచి అందులోని రూ. 14వేల నగదు, 2 తులాల వెండి ఎత్తుకు వెళ్లినట్లు గుర్తించారు. రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. అలాగే పట్టణంలోని మల్‌రెడ్డిపల్లిలోని ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడిన దొంగలకు ఏమీ దొరకక పోవడంతో వెనుదిరిగి వెళ్లినట్లు ఎస్‌ఐ చెప్పారు.

మత్స్యకారులకు స్కిల్ టెస్టులు



మాట్లాడుతున్న ఏడీ చరిత

కుల్కచర్ల: మత్స్యకారులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మత్స్యశాఖ ఏడీ చరిత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో మత్స్యకారులకు స్కిల్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మత్స్యకారులు ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని.. మత్స్యసంపద వృద్ధికి అవసరమైన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మత్స్యకారులకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వాన్ని ఇస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం గ్రామ అధ్యక్షుడు అనంతయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్, ముదిరాజ్ సంఘ గ్రామ అధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఇక నిరంతరం

- కోతల నివారణకు చర్యలు
- పాత స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు



పట్టణ శివారులో నూతన స్తంభాల ఏర్పాటు

కొడంగల్ రూరల్: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతీ ఇంట్లో ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు గిర్రున తిరుగుతూనే ఉంటాయి. దీంతో వేసవిలో ఒక్కసారిగా విద్యుత్ వినియోగం పెరిగిపోతుంది. ఇందుకు తగ్గట్లు విద్యుత్ శాఖాధికారులు నిరంతర విద్యుత్ అందించేందుకు, సమస్యలను తొలగించేందుకు, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలల పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో చిన్న చిన్న సమస్యలతోపాటు అవసరమైన చోట సామర్థ్యం పెంచేందుకు, నూతన స్తంభాల ఏర్పాటు తదితర పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖాధికారులు పేర్కొంటున్నారు.

పాతవి తొలగించి..

శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానాల్లో కొత్తవి ఏర్పాటుచేస్తూ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొడంగల్ మండలంలో ఇప్పటివరకు 120 కొత్త స్తంభాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దౌల్తాబాద్ మండలంలో 70, బొంరాస్‌పేట మండలంలో 160 నూతన స్తంభాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ప్రధానరోడ్లకు ఇరువైపులా కొత్త స్తంభాలు వేస్తున్నారు. లైన్లలో స్తంభాల మధ్య దూరం అధికంగా ఉన్న ప్రాంతాలలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు.

సామర్థ్యం పెంచేందుకు కృషి..

నియోజకవర్గంలోని కొడంగల్ మండలంలో 9 ప్రాంతాలలో, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో 8 చొప్పున సామర్థ్యం పెంచేందుకు పరికరాలను అమర్చినట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే నేరుగా సమీపంలోని సబ్‌స్టేషన్ కార్యాలయంలో తెలియజేయాలని అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ సిబ్బందికి తెలియజేస్తే ఎల్‌సీ తీసుకుంటూ మరమ్మతు చేసేందుకు కృషిచేస్తారని అధికారులు చెబుతున్నారు.

“ సమస్యలుంటే తెలపండి



నియోజకవర్గంలో పరిధిలో ఎక్కడైనా విద్యుత్‌సమస్యలు ఉంటే వెంటనే సమీపంలోని సబ్‌స్టేషన్ కార్యాలయంలోగాని, సంబంధిత అధికారులకు తెలియజేయాలి.పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు, అవసరమైన ప్రాంతాలల్లో సామర్థ్యం పెంచేందుకు కృషి చేస్తున్నాం. శిథిలావస్థకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెల స్థానంలో కొత్తవి ఏర్పాటు తదితర పనులను కొనసాగిస్తున్నాం. – నవీన్‌కుమార్, ఏడీఈ, కొడంగల్



గొట్టిముకుల పాఠశాలలో తొలిమెట్టు అమలును తెలుసుకుంటున్న రాష్ట్ర కోఆర్డినేటర్

తొలిమెట్టుతో అద్భుత ఫలితాలు సాధ్యం

వికారాబాద్ అర్బన్: తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తే ప్రాథమిక స్థాయిలో అద్భుత పలితాలు ఉంటాయని తొలిమెట్టు (ఎఫ్‌ఎల్‌ఎన్) రాష్ట్ర కోఆర్డినేటర్ సువర్ణ వినాయక అన్నారు. శనివారం మండల పరిధిలోని గొట్టిముకుల ప్రాథమిక పాఠశాలను సందర్శించి తొలిమెట్టు అమలును పరిశీలించారు. తొలిమెట్టు ఎలా అమలు చేస్తున్నారనే విషయాన్ని అక్కడి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో డీఈఓ రేణుకాదేవి, ఇతర విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది తొలిమెట్టు కార్యక్రమం ఎలా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వాకాబు చేశారు. డీఈఓ రేణుకాదేవి మాట్లాడుతూ ఈ ఏడాది ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టు విజయవంతం అయినట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో తరగతికి సంబంధించిన అన్ని అభ్యాసన ఫలితాలు సాధించే విధంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి రవి, నోడల్ అధికారి వీరకాంతం, ఎస్‌ఆర్‌పీలు నాగరాజు, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

పరిగి: బైక్‌పై వచ్చిన దుండగులు మహిళ మెడలోంచి బంగారు గొలుసును అపహరించారు. ఈ ఘటన పరిగి పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ కేంద్రం సాయిరాం కాలనీకి చెందిన మలిపెద్ద సంపూర్ణ గురువారం రాత్రి బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడు, లాకెట్టు లాక్కొని పారిపోయారు. అపహరించిన బంగారం విలువ సుమారు రూ. 90వేలు ఉంటుందని బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర పథకాలను కాపీ కొడుతున్న కేంద్రం



ముస్లింలకు కానుకలు అందిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేత

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం పేర్లను మర్చి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ముస్లింలకు రంజాన్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రెండు కోట్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలను చూసి సమీపంలో ఉన్న ఇతర రాష్ట్రాల ప్రజలు తమను తెలంగాణలో కలపాలని కోరుతున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులకు అధికారం పైనే ధ్యాస ఉందని, ప్రజలకు సేవ చేసే ఉద్దేశం లేదని ఆయన అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిరంతరం విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. మిషన్ కాకతీయ పథకంతో చెరువుల్లో పూడికతీత పనులను చేపట్టినట్లు తెలిపారు. చెరువుల్లో పుడిక తీయడం వల్ల చెరువుల్లో నీరు నిల్వ ఉండి భూగర్భ జలాల మట్టం పెరిగిందన్నారు.

చెక్కుల పంపిణీ

మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో పలువురుకి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే శుక్రవారం అందించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అనురాధ, కేశంపేట, కొత్తపేట, బైర్కాన్‌పల్లి, పాపిరెడ్డిగూడ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

మీర్‌పేట: మహిళను దారుణంగా హత్య చేసిన నిందితున్ని మీర్‌పేట్ పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ మహేందర్ రెడ్డి కథనం ప్రకారం మీర్‌పేట లెనిన్‌నగర్‌కు చెందిన రేణుక (36), ధాతునగర్‌లో నివసించే దుబ్బాల ప్రకాష్(24)లు కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. రేణుక ఇతరులతో చనువుగా ఉంటుందని అనుమానంతో హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 18న తాడుతో మెడకు బిగించి హత్య చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు ప్రకాష్‌ను అరెస్టు చేసి రిమాండ్ చేశారు.

దేశపతికి కళాకారుల సన్మానం



దేశపతిని సన్మానిస్తున్న జిల్లా కళాకారులు

బొంరాస్‌పేట: ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌ను జిల్లా కళాకారుల సంఘం సన్మానం చేసింది. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన నగదు పురస్కారాల ప్రదానోత్స[illegible] జిల్లా సంఘం నాయకులు కృష్ణయ్య, సురేశ్‌రాజ్‌లు దేశపతిని సన్మానించారు. కళాకారులకు తగిన గుర్తింపు, గౌరవాలు దక్కేలా ప్రభుత్వం కృషిచేయాలన్నారు. ఇందులో మామిడి హరికృష్ణ, వంగా శ్రీనివాస్‌గౌడ్, లంక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనంతగిరి: వికారాబాద్ పట్టణం కొత్తగడి సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాజశేఖర్‌రెడ్డి(20) వికారాబాద్‌లోని ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ శీను తెలిపారు. మిగతా ఇద్దరికి కూడా తీవ్ర గాయాలు కావడంతో హైద్రాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కుక్కలదాడిలో జింక మృతి



జింక కళేబరాన్ని పీక్కుతింటున్న కుక్క

అనంతగిరి: కుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతగిరి ఆలయం సమీపంలో ఓ జింకపై కుక్కలు వెంబడించి దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందింది. ఫారెస్టు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి జింకల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

గాలివాన బీభత్సం

- చేవెళ్లలో భారీ వర్షం
- బీజాపూర్ జాతీయ రహదారిపై కూలిన వృక్షం
- చనువెల్లిలో విరిగిపడిన ఏకశిల ధ్వజస్తంభం



రహదారిపై వృక్షం కూలడంతో నిలిచిన రాకపోకలు

చేవెళ్ల: మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు మండే ఎండలతో అలమటించిన ప్రజలకు ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మండలంలోని చనువెళ్లి, పామెన, బస్తేపూర్, మీర్జాగూడ, ఆలూరు, ఖానాపూర్, నాంచేరి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. మీర్జాగూడ సమీపంలో బీజాపూర్–హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీ మర్రి వృక్షం రోడ్డుపై పడిపోయింది. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. దాదాపు గంటపాటు రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో కిలోమీటర్లపొడువున ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ పోలీసులు సీఐ వాసు, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐ చందర్‌నాయక్‌లు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో జేసీబీలతో చెట్టును పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. చనువెల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద ఉన్న ఏకశిల ధ్వజస్తంభం ఒక్కసారిగా కిందపడిపోవటంతో ముక్కలుముక్కలైంది. పలు గ్రామాల్లో వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. సాగులో ఉన్న పంటలకు తీవ్ర నష్టం కలిగిందని రైతులు వాపోయారు. పామెన గ్రామంలో ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోయింది. మండలంలో అరగంట పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో అంధకారం నెలకొంది.



జాతీయరహదారిపై నిలిచిపోయిన వాహనాలు



పామెన గ్రామంలో విరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పీసీసీ మాజీ కార్యదర్శి రాంరెడ్డికి షోకాజ్ నోటీసు

అబ్దుల్లాపూర్‌మెట్ : కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ వచ్చిన ఫిర్యాదులతో పీసీసీ మాజీ కార్యదర్శి దండెం రాంరెడ్డికి ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ జి. చిన్నారెడ్డి శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. రాబోయే ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని తానేనంటూ ప్రకటించుకోవడమే కాకుండా గ్రూపు రాజకీయాలకు పాల్పడుతున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. పార్టీకి నష్టం వాటిల్లే విధంగా వ్యవహరించడంతో పాటు బీఆర్‌ఎస్ నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు షోకాజ్ జారీ చేశారు.

క్షుద్రపూజల కలకలం



రూప్‌ఖాన్‌పేట్ శివారులో క్షుద్రపూజలు

పరిగి: మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్‌లో జరిగిన క్షుద్రపూజలు కలకలం రేపాయి. గ్రామ శివారు వాగులో గుర్తు తెలియని కొందరు క్షుద్ర పూజలు నిర్వహించారు. ఘటనా స్థలంలో నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, గుమ్మడికాయలతో పూజలు నిర్వహించి కోడిని భలి ఇచ్చారు. అమావాస్య కావడంతో గురువారం అర్ధరాత్రి క్షుద్ర పూజలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో చుట్టు పక్కల రైతులు, ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. క్షుద్ర పూజల ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.



పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇసుక ట్రాక్టర్లు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కుల్కచర్ల: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డిపల్లికి చెందిన మూడు ట్రాక్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాయిని శేఖర్, జినుగు రామకృష్ణ, మల్లేష్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్‌ఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

మొగిలిగిద్దలో టెంట్ హౌస్ దగ్ధం

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు టెంట్ హౌస్‌కు నిప్పుపెట్టారు. గ్రామంలోని జంజం టెంట్ హౌస్‌ను యజమాని నిజాముద్దీన్ రోజులాగే యథావిధిగా గురువారం రాత్రి సామగ్రి లోపల పెట్టి షెటర్‌కు తాళం వేసి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో టెంట్ హౌస్‌కు నిప్పంటించారు. సామగ్రి, ఫర్నిచర్‌తో పాటుగా అందులో ఉన్న ద్విచక్రవాహనం దగ్ధమయ్యింది. టెంట్ హౌస్‌లో మంటలు వ్యాపించిన విషయాన్ని స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. శుక్రవారం ఉదయం విషయం తెలుసుకున్న బీజేపీ అధికార ప్రతినిధి కక్కునూరు వెంకటేశ్ గుప్తా.. దుకాణాన్ని సందర్శించి బాధితుడిని పరామర్శించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు నిజాముద్దీన్ తెలిపారు.

కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం



ఆత్మీయసమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ఆలూరు క్లస్టర్‌లో ఆత్మీయ సమ్మేళనం

చేవెళ్ల: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని, ఈ ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ఖానాపూర్ బస్‌స్టేజీ వద్ద ఉన్న కల్యాణ మండపంలో శుక్రవారం క్లస్టర్‌పరిధిలోని ఆలూరు, దేవరంపల్లి, రేగడిఘనాపూర్, ఖానాపూర్, నాంచేరి,అంతారం, కౌకుంట్ల, హస్తేపూర్, మిర్జాగూడ, బస్తేపూర్ గ్రామాల నాయకులు, కార్యకర్తలతో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, డీసీఎంఎస్ చైర్మన్ పి. కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యమ నేత రాష్ట్రానికి రథసారధి అయితే అభివృద్ధి జరుగుతుందని, అందుకు మన రాష్ట్రమే నిదర్శనమన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా అనేక పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని అన్నారు. జాతీయ స్థాయి పంచాయతీ అవార్డులు ఎక్కువగా మన రాష్ట్రానికే రావటం అభివృద్ధికి నిదర్శనమని చెప్పారు. ముఖ్యమంత్రికి మనమంతా అండగా నిలబడి ఆయనను గెలిపించుకుంటే రానున్న కాలంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ నాయకులు చేవెళ్ల గడ్డకు, జిల్లాకు ఏమి చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం. విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం. మాలతి, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, వైస్ ఎంపీపీ కె. శివప్రసాద్, వైస్ చైర్మన్. బి. నర్సింహులు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శేరి శివారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బి. రవీందర్‌రెడ్డి, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు వనం లక్ష్మీకాంత్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, టీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు నరేందర్, పార్టీ మండల అధ్యక్షుడు పి. ప్రభాకర్, ఉపాధ్యక్షుడు రామగౌడ్, నాయకులు ఉన్నారు.

25న నియోజకవర్గ స్థాయి సమ్మేళనం

ఈనెల 25న నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని పార్టీ ఆదేశించిందని దీంతో పెద్ద ఎత్తున నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు తరలి రావాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండాలను ఎగురవేసి సమావేశానికి తరలి రావాలని చెప్పారు.